సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



జల్సాలకు అలవాటుపడి..

జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు.

- 8లో ▸



కొత్త రేషన్ కార్డుల కోసం..

కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో అందించిన దరఖాస్తులపై మరోసారి సర్వే మొదలైంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
37.8 /21.0

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వాతావరణంలో తేమ తక్కువగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాములోరి కల్యాణానికి పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: శ్రీరామనవమి పురస్కరించుకొని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ దంపతులు ఆదివారం జిల్లాలోని భీమ్‌గల్ మండలం పిప్రి, రహత్‌నగర్ గ్రామాలకు రానున్నారు. రహత్‌నగర్ సమీపంలోని పిప్రి వద్ద ఉన్న లొద్ది రామన్న ఆలయంలో నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణంలో పాల్గొననున్నారు. రహత్‌నగర్ మహేశ్ కుమార్‌గౌడ్ సొంత గ్రామం కాగా సరిహద్దులో ఉన్న పిప్రి వద్ద ఆయన తండ్రి బొమ్మ గంగాధర్‌గౌడ్ 1969లో ఈ రామాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం వారి కుటుంబానికి సెంటిమెంట్ కావడంతో చిన్ననాటి నుంచి నేటి వరకు సేవలు చేస్తూ వస్తున్నారు. సీతారాముల కల్యాణ క్రతువులో మహేశ్ గౌడ్ కుటుంబసమేతంగా పాల్గొననున్నారు. పీసీసీ అధ్యక్షుడు అయ్యాక మొదటిసారి గ్రామ కమిటీ ఆహ్వానం మేరకు మహేశ్ గౌడ్ రానున్నారు.

నేడు వైన్ షాపులు బంద్



ఖలీల్‌వాడి: శ్రీ రామనవమి సందర్భంగా జిల్లాలోని వైన్స్ షాపులు, కల్లు దుకాణాలు, బార్‌లను నేడు(ఆదివారం) మూసివేయాలని సీపీ పోతరాజు సాయిచైతన్య శనివారం ఆదేశించారు. ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 6 వరకు మూసి ఉంచాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి దుకాణాలు తెరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి



నిజామాబాద్‌అర్బన్: భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కంఠేశ్వర్ కమాన్ వద్ద ఉన్న పాత అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ఉత్సవాల్లో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్‌లు అంకిత్, కిరణ్‌కుమార్ పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాత అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ప్రత్యేకించి యువతరం, విద్యార్థుల్లో స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ హనుమంతు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారిణి నిర్మల, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, ఆయా శాఖల అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల వెలుగులో సుభాష్‌నగర్ రామాలయం

సత్యం, దయ, ప్రేమ, ధర్మం మూర్తీభవించిన శ్రీరాముడి జన్మదిన వేడుకలకు జిల్లా ముస్తాబైంది. సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రంలోని రఘునాథ ఆలయం, బడా రాంమఠం, సుభాష్‌నగర్ రామాలయం, ఖిల్లా డిచ్‌పల్లి, శక్కర్‌నగర్ కోదండరామాలయం, ఆర్మూర్‌లోని సిద్దులగుట్ట, అంకాపూర్, కందకుర్తి, తాడ్‌బిలోలి రామాలయాలు నవమి వేడుకలకు ముస్తాబయ్యాయి. లక్షలాది మంది భక్తులు రాములోరిని దర్శించుకుని కల్యాణోత్సవంలో పాల్గొనను న్నారు. సుభాష్‌నగర్‌లోని రామాలయంలో సీతమ్మవారికి ఓ భక్తుడు బంగారు పట్టుచీర కానుకగా అందించగా, అంకాపూర్‌లో ప్రత్యేక రథాన్ని తయారు చేయించారు. ఇలా ఎక్కడ చూసినా శ్రీరామనవమి వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

– నిజామాబాద్ రూరల్



సుభాష్‌నగర్ రామాలయంలో దేవతామూర్తులు

సండే స్పెషల్

రారండోయ్.. వేడుక చూద్దాం

■ నేడు శ్రీరామనవమి ■ సుగుణాభిరాముడి కల్యాణానికి ఏర్పాట్లు



డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలోని సీతారాముల విగ్రహాలు

- సమర్థ రామదాసు నిర్మించిన ఆలయాల్లో కొలువుదీరిన కోదండరాముడు
- దేదీప్యంగా వెలుగుతున్న ఆలయాలు
- నాటి చారిత్రక వైభవాన్ని సజీవంగా నిలబెట్టిన పెద్దరామమందిర్, రఘునాథ ఆలయాలు
- జిల్లాపై ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసు ముద్ర

ఇందూరు రఘునాథుడు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: శ్రీరాముడు, హనుమంతుడి భక్తుడైన సమర్థ రామదాసు 17వ శతాబ్దంలో నిర్మింపజేసిన ఆలయాలు ఇందూరు జిల్లా ఘనమైన చరిత్రను దేదీప్యంగా నిలబెడుతున్నాయి. మహారాష్ట్ర పక్కనే ఉండడంతో ఇందూరు జిల్లాలో మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ ప్రభావం ఎక్కువగా ఉంది. ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసుచే నిర్మితమైన పెద్దరామమందిర్, విస్తరించబడిన రఘునాథ ఆలయం గత చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ ఆలయాలకు, డిచ్‌పల్లిలోని రామాలయానికి అనుసంధానంగా భూగర్భంలో సొరంగ మార్గాలు ఉన్న ట్లు రఘునాథ ఆలయ గోడలపై సూచికలు ఉన్నాయి.



విద్యుత్ దీపాల వెలుగులో ఖిల్లా రామాలయం



ఖిల్లా రఘునాథ ఆలయ ముఖద్వారం

రఘునాథ ఆలయాన్ని గుట్టపై 914–928 సంవత్సరాల మధ్య రాష్ట్రకూట రాజవంశానికి చెందిన ఇంద్రుడు అనే రాజు 3,900 గజాల కోటను నిర్మించాడు. అదేవిధంగా ఇక్కడ 53 అడుగుల ఎత్తైన అఖండ శిలాధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. దీనిపై గరుడదీపం వెలిగిస్తే చుట్టుపక్కల ఊర్ల ప్రజలు దీపాలు వెలిగించుకునేవారు. కాగా రఘునాథుడనే మహర్షి ఖిల్లాలోని ప్రత్యేక సొరంగ మార్గం గుండా బొడ్డెమ్మ చెరువుకు వెళ్లి స్నానం చేసి వచ్చేవారని చరిత్ర చెబుతోంది. తరువాత 17వ శతాబ్దంలో సమర్థ రామదాసు శ్రీరాముడి ఆలయాన్ని నిర్మింపజేశారు. అదేవిధంగా ఇక్కడ ధాన్యమందిరం నిర్మించారు. ఇందులో సమర్థ రామదాసుతో పాటు ఛత్రపతి శివాజీ సైతం ధాన్యం చేసుకున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

నగరం నడిబొడ్డున ఉన్న పెద్ద రామమందిర్‌ను 17వ శతాబ్దంలో సమర్థ రామదాసు నిర్మింపజేశారు. ఇక్కడ శ్రీరాముడు, హనుమాన్ మందిరాలు ఎదురెదురుగా ఉంటాయి. శ్రీరాముడి విగ్రహం పాదాల నుంచి సమాంతరంగా హనుమంతుడి తలభాగం ఉండేలా నిర్మాణం చేయడం ఇక్కడి ప్రత్యేకత. ఈ ప్రాంగణంలో ఉన్న కోనేరు ఆకట్టుకుంటుంది. ఇందులో గోశాల చక్కగా నిర్వహిస్తున్నారు. 'బడా రామ్ మఠల్' ఆధ్వర్యంలో ఈ ఆలయం నిర్వహిస్తున్నారు. మఠాధిపతులుగా 1632 నుంచి ఉద్ధవ్ స్వామి, 1656 నుంచి మాధవ్ స్వామి, 1687 నుంచి గోవింద్‌స్వామి, 1725 నుంచి అనంత్ స్వామి, 1739 నుంచి నృసింహ స్వామి, 1754 నుంచి రామకృష్ణ స్వామి, 1778 నుంచి రామచంద్ర స్వామి, 1804 నుంచి జయరామ్ స్వామి, 1834 నుంచి ఆత్మారాం స్వామి, 1848 నుంచి వామన్ స్వామి, 1853 నుంచి రాజారాం స్వామి, 1866 నుంచి కేశవ్ స్వామి, 1904 నుంచి కల్యాణ్ స్వామి, 1905 నుంచి దినకర్ స్వామి 1983 నుంచి యశోజీ స్వామి మఠాధిపతులుగా ఉన్నారు. ఛత్రపతి శివాజీ ఈ ఆలయాన్ని సందర్శించారు.



ఖిల్లా రామాలయంలో భక్తుల కోసం క్యూలైన్ ఏర్పాట్లు



సీతమ్మవారికి భక్తుడు బహూకరించిన బంగారు పట్టుచీర

ఇందూరు సీతమ్మతల్లికి సిరిసిల్ల బంగారు పట్టుచీర

- సుభాష్‌నగర్ రామాలయానికి ఓ భక్తుడి అపురూప కానుక
- ఏడు గ్రాముల బంగారం, నాణ్యమైన పట్టుతో చీర తయారీ
- రామ, లక్ష్మణ, హనుమంతులవారికి పట్టువస్త్రాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నాలుగు దశాబ్దాల చరిత్రి ఉన్న ఇందూరు నగరంలోని సుభాష్‌నగర్ రామాలయానికి ఓ భక్తుడు అపురూపమైన కానుక ఇచ్చారు. నగరానికి చెందిన జ్యూయెలరీ షాపు యజమాని మనోహర్ దంపతులు రామలక్ష్మణులకు, హనుమంతులవారికి పట్టు వస్త్రాలు బహూకరించడంతోపాటు సీతమ్మ తల్లికి బంగారు పట్టు చీరను బహూకరించారు. అత్యంత నాణ్యమైన పట్టుతోపాటు 7 గ్రాముల బంగారం కలిపి ఈ చీరను తయారు చేశారు. దేశంలోనే ప్రఖ్యాతి కలిగిన సిరిసిల్లకు చెందిన ప్రముఖ నేత కళాకారుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రధాని మోదీతో ప్రశంసలు పొందిన హరిప్రసాద్ ఈ చీరను తయారు చేశారు. అగ్గిపెట్టెలో పట్టేంత పట్టుచీర, దబ్బణంలో దూరే చీర వంటివి అనేకం తయారు చేసిన హరిప్రసాద్.. భారతదేశం, అశోకచక్రం, జాతీయగీతం, జీ20 సదస్సు ప్రత్యేకతలను తెలుపుతూ చీరలను తయారు చేశారు. అయోధ్య బాలరాముడికి పట్టు వస్త్రాలు, భద్రాచలం సీతమ్మవారికి పట్టు చీర అందించిన హరిప్రసాద్‌తో ఈ చీరను తయారు చేయించారు. శనివారం బంగారు పట్టు చీరను ఆలయ కమిటీకి మనోహర్ దంపతులు అందజేశారు. సీతారాముల కల్యాణోత్సవంలో ఈ చీర తో సీతమ్మను అలంకరించనున్నారు. ఆలయ 40వ వార్షిక బ్రహ్మోత్సవాలను, సీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకుని ఇంత అపురూపమైన కానుక అందించడం సంతోషంగా ఉందని ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సరళామహేందర్‌రెడ్డి అన్నారు.

దాతల సహకారంతో కచ్చితమైన విధానంలో సుభాష్‌నగర్ రామాలయంలో క్రతువులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఆలయ 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 3వ తేదీన ప్రారంభమయ్యాయి. ఈ నెల 9వ తేదీ వరకు బ్రహ్మోత్సవ కార్యక్రమ క్రతువులు నిర్వహించనున్నారు. 1986 ఏప్రిల్ 14వ తేదీన ఆలయ ప్రతిష్ఠ జరిగింది. 40వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయంలో ప్లాస్టిక్ రహితంగా అన్ని కార్యక్రమాలు చేసేందుకు స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం దాతలు స్టీల్ వస్తువులు సమకూరుస్తున్నారు.



సుభాష్‌నగర్ రామాలయంలో కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న మహిళలు

భక్తుల కొంగు బంగారం కోదండ రామాలయం




బోధన్ శక్కర్‌నగర్ కోదండ రామాలయంలోని విగ్రహాలు

బోధన్‌టౌన్(బోధన్): జిల్లా కేంద్రానికి 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న బోధన్‌లోని శక్కర్‌నగర్ కోదండ రామాలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. ఈ ఆలయాన్ని 1951లో నిర్మించారు. పాలరాతిపై చెక్కిన సీతారామ లక్ష్మణ విగ్రహాలను అప్పట్లో ప్రతిష్ఠించారు. 74 యేళ్ళు గడుస్తున్నా దేవతా మూర్తుల పాలరాత్రి విగ్రహాలు వన్నె తగ్గకపోవడం విశేషం. ఆలయప్రాంగణం 2 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. కలియుగ వైకుంఠమైన భద్రాద్రిలో నిర్వహించే రాములోరి పెళ్లిలాగే ఇక్కడ కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఈ ఆలయంలో సీతారామ లక్ష్మణుల దేవతా విగ్రహాలు పశ్చిమాభిముఖంలో ఉండటం కారణంగా రెండో భద్రాద్రిగా ప్రఖ్యాతిపొందింది. ప్రతియేటా శ్రీరామనవమి ఉత్సవాలను వారంరోజులపాటు నిర్వహిస్తారు. ఆదివారం రాములోరి కల్యాణోత్సవం, సోమవారం పట్టాభిషేకం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

మూడురోజులపాటు ఉత్సవాలు..

డిచ్‌పల్లి: జిల్లాలోనే చారిత్రక ఆలయమైన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో మూడు రోజులపాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. కాకతీయుల కాలం నాటి అపురూప శిల్పకళా నిలయంగా ఉన్న రామాలయానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం హనుమంత సేవ, ఆదివారం ఉదయం 11 గంటలకు శ్రీరాముని జననం, 12.01 గంటలకు శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణం, రాత్రి 7 గంటలకు స్వామి వారికి అశ్వవాహన సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సోమవారం ఉదయం 11 గంటలకు శ్రీరామ పట్టాభిషేకం, రాత్రి 7 గంటలకు హనుమంతుని సేవతో నవమి ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ చైర్మన్ శాంతయ్య, ప్రధానార్చకులు సుమిత్ శర్మ దేశ్‌పాండే తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ, వీడీసీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్తా కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.



డాక్టర్ అవతారమెత్తిన కాంపౌండర్లు

- ప్రముఖ కంటి వైద్యుడు కృష్ణమూర్తి ఆస్పత్రుల్లో ఘటన
- ఫిర్యాదు రావడంతో వైద్యాధికారుల తనిఖీలు

నిజామాబాద్ నాగారం: పవిత్రమైన వైద్య వృత్తికే కళంకం తెస్తున్నాయి కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు. జిల్లా కేంద్రంలో వరుసగా వెలుగులోకి వస్తున్న ఘటనలే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. నగరంలోని ఓ ఆస్పత్రిలో ఇటీవల న్యూరో వైద్యుడు లేకపోవడంతో కాంపౌండరే వైద్యుడిగా అవతారమెత్తి సేవలందించడంపై అధికారులకు ఫిర్యాదు వెళ్లిన విషయం తెలిసిందే. అది మరువకముందే తాజాగా మరో రెండు ఆస్పత్రుల్లో కాంపౌండర్లు వైద్య నిపుణుల అవతారమెత్తారు. నగరంలోని శ్రీరామ నేత్ర వైద్యశాల, గిరిజా కంటి ఆస్పత్రులకు చెందిన వైద్యుడు కృష్ణమూర్తి గత మూడు రోజులుగా అందుబాటులో లేరు. దీంతో కంటి సమస్యలతో ఈ ఆస్పత్రులకు వచ్చే రోగులకు కాంపౌండర్లు పరీక్షలు నిర్వహిస్తూ మందులు సైతం రాస్తున్నారు. ఈ విషయమై శనివారం రోగులు ఫిర్యాదు చేయడంతో డీఎంహెచ్‌వో రాజశ్రీ స్పందించారు. డాక్టర్ సుప్రియ, అధికారులు వేణు తదితరులు కలిసి రాత్రి 7 గంటల నుంచి 9.30 గంటల వరకు రెండు ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించారు. ఎంత మంది రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు రాశారో పరిశీలించారు. తనిఖీల విషయం తెలుసుకున్న డాక్టర్ కృష్ణమూర్తి ఆస్పత్రులకు చేరుకున్నారు. కాగా, పూర్తి నివేదిక అనంతరం చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో రాజశ్రీ 'సాక్షి'తో తెలిపారు.



ఆస్పత్రిలో విచారిస్తున్న అధికారుల బృందం

అందుబాటులోకి ఎల్‌సీ యాప్

- విద్యుత్ ప్రమాదాల నివారణకు ఎన్‌పీడీసీఎల్ సేవలు
- లైన్ క్లియర్ అనుమతి నుంచి రిటర్న్ వరకు యాప్‌లోనే..
- అనవసర ఎల్‌సీలకు చెక్

సుభాష్‌నగర్: విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఎన్‌పీడీసీఎల్ మరో యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆన్‌లైన్ ఎల్‌సీ (లైన్ క్లియర్) యాప్‌ను ప్రవేశపెట్టింది. ఎల్‌సీలు తీసుకుని పని చేసే సమయంలో మానవ తప్పిదాలు జరుగుతున్న నేపథ్యంలో నూతనంగా తీసుకొచ్చిన యాప్ అటు వినియోగదారులకు.. ఇటు ఎన్‌పీడీసీఎల్‌కు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. విద్యుత్ సరఫరాలో భద్రతా ప్రమాణాలను పెంచేందుకు, విద్యుత్ అంతరాయ సమయాలు, మానవ తప్పిదాలను నివారించేందుకు లైన్ క్లియర్ (ఎల్‌సీ) యాప్‌ను రూపొందించామని ఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ ఎస్‌ఈ రాపెల్లి రవీందర్ తెలిపారు.



లైన్‌క్లియర్ (ఎల్‌సీ) యాప్ లోగో

లైన్ క్లియర్ యాప్ అమలు విధానం

విద్యుత్ సరఫరాలో ఎల్‌సీ తీసుకోవాలనుకున్న లైన్‌మెన్ మొదటగా లైన్ క్లియర్ యాప్ ఓపెన్ చేయాలి. సంబంధిత ఫీడర్‌లో ఎల్‌సీ కావాలని ఏఈకి విన్నవిస్తారు. ఏఈ లైన్‌మెన్ విన్నపాన్ని పరిశీలించి ఆ ఫీడర్‌లో ఎల్‌సీ ఇవ్వొచ్చా.. లేదా అని, అత్యవసర అవసరాలు ఏమైనా ఉన్నాయా లేదా మరే ఇతర షెడ్యూల్ చేసిన పనులు ఉన్నాయా అని సమీక్షించుకుంటారు. దాని ప్రకారం ఏఈ ఎల్‌సీ ఇవ్వొచ్చు లేదా నిరాకరించవచ్చు.. ఏఈ ఎల్‌సీకి అనుమతి ఇవ్వగానే సంబంధిత లైన్‌మెన్‌కు సమాచారం అందుతుంది. అలాగే సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఏ ఫీడర్ ఇవ్వాలో యాప్ ద్వారా మెసేజ్ వస్తుంది. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఎల్‌సీ ఇవ్వాల్సిన సమయంలో పొరపాట్లు లేకుండా తగిన సూచనలు, జాగ్రత్తలు హెల్మెట్ పెట్టుకోవడం, హ్యాండ్ గ్లౌజ్ వేసుకోవడం, ఎర్త్ రాడ్ వేయాలని, ఏబీ స్విచ్ ఓపెన్ చేస్తారా లేదా అని యాప్ గుర్తు చేస్తుంది. వీటన్నింటిని సబ్‌స్టేషన్ ఆపరేటర్ చేసి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే ఆ ఫొటోను యాప్ ద్వారా లైన్‌మెన్ చూసి.. ఆ ఫొటోలో కనిపిస్తున్న ఫీడర్, ఏబీ స్విచ్ ఓపెన్ చేసారా.. లేదా.. అని ధ్రువీకరించుకుని పనికి ఉపక్రమిస్తాడు. లైన్‌మెన్ ఎంతమంది సిబ్బందితో పని చేయిస్తున్నాడో వారి పేర్లు యాప్‌లో పొందుపర్చాలి.

లైన్‌మెన్ పని పూర్తి కాగానే ఈ పనికి సంబంధించి ఫొటో, సిబ్బంది వచ్చారా.. లేదా అని యాప్‌లో పొందుపర్చి ఎల్‌సీని రిటర్న్ చేస్తారు. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు యాప్ ద్వారా ఎల్‌సీ రిటర్న్ చేయాలని ఆదేశాలు వెళ్తాయి. రిటర్న్ చేసిన ఎల్‌సీ సమాచారం ఏఈకి అందుతుంది. ఏఈ ఆదేశాల మేరకు ఆ ఫీడర్‌లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు.

యాప్‌తో ప్రమాదాల నివారణ!

విద్యుత్ లైన్ క్లియర్‌లో ఒక ఫీడర్ బదులు మరో ఫీడర్‌ను ఎంచుకోవడం, పంపిణీ వ్యవస్థ సరిగ్గా గుర్తు చేసుకోకపోవడం, సమాచార లోపం, తదితర కారణాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటి నివారణ కోసం ఆన్‌లైన్ ఎల్‌సీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. యాప్ ద్వారా మానవ తప్పిదాలను పూర్తిగా నివారించొచ్చు. అలాగే అనవసరమైన ఎల్‌సీలు తగ్గించొచ్చు. ఎల్‌సీల సమయాలను గణనీయంగా తగ్గించడమే కాకుండా ఎల్‌సీ తీసుకున్న సమాచారం పైఅధికారులకు వెంటనే తెలిసిపోతుంది. సంబంధిత ఏఈ అనుమతి లేకుండా తీసుకునే ఎల్‌సీలను ఈ యాప్ ద్వారా నివారించొచ్చు.











కొత్త రేషన్‌కార్డులపై మళ్లీ సర్వే

- రెవెన్యూ ఉద్యోగులకు పౌర సరఫరాల శాఖ ఆదేశాలు
- సర్వే అనంతరం కొత్త కార్డుల జారీకి అవకాశం



మోర్తాడ్‌(బాల్కొండ): కొత్త రేషన్‌ కార్డుల కోసం ప్రజాపాలనలో అందించిన దరఖాస్తులపై మరోసారి సర్వే మొదలైంది. రెండు, మూడు రోజుల్లో సర్వే పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ రెవెన్యూ ఉద్యోగులకు నిర్దేశించింది. ఈ మేరకు శుక్రవారం పౌర సరఫరాల శాఖ రెవెన్యూ ఉద్యోగుల మొబైల్‌ ఫోన్లకు ఒక లింకును పంపించి ఆ యాప్‌లోనే కొత్త కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులపై సర్వే నిర్వహించాలని స్పష్టం చేసింది. ఏడేళ్లుగా నిలిచిన రేషన్‌కార్డుల జారీకి కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మోక్షం లభిస్తుందని అంతా ఊహించారు. కానీ, గడిచిన ఏడాది నుంచి రేషన్‌ కార్డులు అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదు. గణతంత్ర దినోత్సవం రోజు మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి కొత్త కార్డులను జారీ చేశారు. మిగిలిన గ్రామాల్లో పంపిణీకి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ ముగిసిన తర్వాత చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. కోడ్‌ ముగిసినా కార్డుల జారీలో వేగం పెరగలేదు. ప్రజాపాలనలో కొత్త రేషన్‌ కార్డుల కోసం 81,148 దరఖాస్తులు అందగా, జనవరి 26న 31 గ్రామాల నుంచి ఎంపిక చేసిన 1066 కుటుంబాలకు కొత్త కార్డులను జారీ చేశారు. మరో 80వేలకు పైగా కుటుంబాలు కొత్త కార్డుల కోసం నిరీక్షిస్తున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపేందుకు రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో కొత్త కార్డుల కోసం అర్హులు ఎదురుచూస్తున్నారు. రేషన్‌ కార్డులు లేకపోవడంతో సన్నబియ్యం పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాప్యం చేస్తున్నారు



కొత్త రేషన్‌కార్డుల జారీకి మరోసారి సర్వే నిర్వహించాలని నిర్ణయించడం సరైంది కాదు. సర్వేల పేరిట కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. కొత్త కార్డులను అర్హులైన కుటుంబాలకు వెంటనే అందించాలి.

– ఏనుగు రాజేశ్వర్‌, మోర్తాడ్‌

నిర్లక్ష్యం తగదు



ఎంతో మంది అర్హులు కొత్త కార్డుల కోసం నిరీక్షిస్తున్నారు. కార్డులను జారీ చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదు. ప్రభుత్వం స్పందించి వెంటనే కార్డులను జారీ చేయాలి.

– తక్కూరి సాగర్‌, మోర్తాడ్‌

బీజేపీ విజయయాత్రను వివరించాలి



సుభాష్‌నగర్‌: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లాలోని అన్ని పోలింగ్‌ బూత్‌లలో పార్టీ జెండా ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ పటేల్‌ కులాచారి పేర్కొన్నారు. బూత్‌ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ సిద్ధాంతాలు, విజయయాత్రను ప్రజలకు వివరించాలని సూచించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లాస్థాయి పదాధికారుల సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌ రామ్‌ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పోలింగ్‌ బూత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించే జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 14న డాక్టర్‌ బాబాసాహెబ్‌ అంబేడ్కర్‌ జయంతిని ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డే మోహన్‌రెడ్డి, ఆర్మూర్‌ మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ కంచెట్టి గంగాధర్‌, జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతన్‌కర్‌ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, రాష్ట్ర, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, కన్వీనర్లు, కో కన్వీనర్లు, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ సతీమణికి భగవద్గీత అందజేత



సుభాష్‌నగర్‌: నగరంలోని నీలకంఠేశ్వరాలయంలో కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సతీమణి విజయలక్ష్మీకి మంచాల శంకరయ్య చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ మంచాల జ్ఞానేందర్‌ దంపతులు భగవద్గీత, వారాహి మాతా చిత్రపటాన్ని శనివారం అందజేశారు. నగర శివారులోని అమ్మనగర్‌లో నిర్మిస్తున్న వారాహి మాతా ఆలయాన్ని సందర్శించాలని ఆహ్వానించారు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడతా



డిచ్‌పల్లి: అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నిజామాబాద్‌ రూరల్‌ నియోజకవర్గాన్ని జిల్లాలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే డాక్టర్‌ రేకులపల్లి భూపతిరెడ్డి పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని కొరట్‌పల్లి తండా, కొరట్‌పల్లి, సుద్దులం, యానంపల్లి, సాంపల్లి, సుద్దపల్లి గ్రామాల్లో రూ.12.50 కోట్ల నిధులతో శనివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్‌ రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పులపాలు చేశారని విమర్శించారు. వాటికి నెలానెలా వడ్డీ చెల్లిస్తూనే కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ నాయకులు రాష్ట్రాభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్‌ శేఖర్‌గౌడ్‌, ఐడీసీఎంఎస్‌ మాజీ చైర్మన్‌ మునిపల్లి సాయిరెడ్డి, తారాచంద్‌ నాయక్‌, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్‌ గంగాధర్‌, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌, సొసైటీ చైర్మన్లు రాంచందర్‌గౌడ్‌, చింత శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్‌, చిన్నోళ్ల నర్సయ్య, నాయకులు సురేందర్‌రెడ్డి, సేవాలాల్‌, మహేశ్‌, మహిపాల్‌, అంకం నరహరి తదితరులు పాల్గొన్నారు.

అణగారినవర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్‌



జగ్జీవన్‌రామ్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ యాదగిరి, అధ్యాపకులు

- రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): బాబూ జగ్జీవన్‌రామ్‌ అట్టడుగు, అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి అని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం యాదగిరి పేర్కొన్నారు. తెయూ ఎస్సీ సెల్‌ డైరెక్టర్‌ వాణి అధ్యక్షతన బాబూ జగ్జీవన్‌రామ్‌ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం రిజిస్ట్రార్‌ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, కేంద్రంలో వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా కూడా వ్యవహరించి దళిత హక్కుల రక్షణ కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ మామిడాల ప్రవీణ్‌, ప్రొఫెసర్‌ కనకయ్య, బీ అంజయ్య, వైస్‌ ప్రిన్సిపల్‌ లక్ష్మణచక్రవర్తి, కిరణ్‌ రాథోడ్‌, బీఆర్‌ నేత, విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

యువత ఆదర్శంగా తీసుకోవాలి

నిజామాబాద్‌ సిటీ: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌ జయంతిని కాంగ్రెస్‌ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో జగ్జీవన్‌ రామ్‌ చిత్రపటానికి ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ అంటరానితనానికి వ్యతిరేకంగా జగ్జీవన్‌రామ్‌ పోరాడారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్‌ పార్టీ దేశ వ్యాప్తంగా జై బాపు జై భీం జై సంవిధాన్‌ అభియాన్‌ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు మీసాల సుధాకర్‌ రావు, జావేద్‌ అక్రమ్‌, ప్రొఫెసర్‌ విద్యాసాగర్‌, నరేందర్‌ గౌడ్‌, కోనేరు సాయికుమార్‌, గోపి, సంతోష్‌, ప్రమోద్‌, బొబ్బిలి రామకృష్ణ, వినయ్‌, సుభాష్‌ జాదవ్‌, నరేందర్‌సింగ్‌, స్వామి గౌడ్‌, సంగెం సాయిలు, చాంగూబాయి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన బైక్‌.. ఒకరి మృతి

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మైలారం గ్రామంలో ఉన్న డబుల్‌ బెడ్రూం ఇళ్ల వద్ద శనివారం చోటు చేసుకుంది. ఎస్సై లావణ్య తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్‌ మండలం సంభాపూర్‌ గ్రామానికి చెందిన గైక్వాడ్‌ సంతోష్‌(36) మేస్త్రీ పని చేస్తుంటాడు. శనివారం ఉదయం పని నిమిత్తం సంతోష్‌, సుభాష్‌ ఇద్దరూ బీర్కూర్‌ నుంచి నస్రుల్లాబాద్‌కు బైక్‌పై వెళ్తున్నారు. సుభాష్‌ అతివేగంగా నడపడంతో బైక్‌ అదుపుతప్పి వెనకాల ఉన్న సంతోష్‌ కిందపడ్డాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రికి తరలించగా, సంతోష్‌ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్‌ తెలిపారన్నారు. భార్య సురేఖ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మైలారంలో ఒకరి ఆత్మహత్య

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామానికి చెందిన దూళి గంగారాం (65) శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. గంగారాంకు ఇద్దరు కుమారులు కాగా, భార్యతో కలిసి ఇంటి పైన రేకుల గదిలో నివాసముంటున్నాడు. రాత్రి ఇంట్లో భార్య లేని సమయంలో ఉరేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

క్రైం కార్నర్‌

పడకల్‌లో దొంగల బీభత్సం

- నాలుగిళ్లలో భారీ చోరీ
- ఏడు తులాల బంగారం, 50 వేల నగదు అపహరణ



అరవింద్‌ ఇంట్లో దుండగులు పగులగొట్టిన బీరువా

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్‌ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసి ఉన్న నాలుగు ఇళ్లలో చోరీకి పాల్పడి ఏడు తులాల బంగారు నగలు, 50 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి శనివారం పరిశీలించారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రంగు అరవింద్‌, ఉట్ల నవీన్‌, సోం నరేశ్‌, నడుకుడ నర్సు ఇళ్లకు తాళాలు వేసి పనులు, శుభకార్యాల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లారు. దుండగులు అర్ధరాత్రి వీరి ఇళ్ల తాళాలు పగులగొట్టి బీరువాల్లో ఉన్న ఏడు తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. అద్దెకు ఉండే చాకలి నర్సు ఇంట్లో చొరబడినప్పటికీ ఎలాంటి విలువైన వస్తువులు లేకపోవడంతో తిరిగి వెళ్లిపోతూ సోం శ్రీనివాస్‌ ఇంటి వద్ద పార్క్‌ చేసిన బైకును ఎత్తుకెళ్లారు. గ్రామ పొలిమేరలోనే బైక్‌ పంక్చర్‌ కావడంతో అక్కడే వదిలేశారు. అనంతరం మళ్లీ గ్రామంలోకి తిరిగి వచ్చిన దుండగులు బడాల నరేశ్‌ ఇంట్లో ఉన్న పల్సర్‌ బైక్‌ను దొంగిలించుకొని పారిపోయారు. బైక్‌పై ఆర్మూర్‌ వైపు వెళుతుండగా అర్గుల్‌ సమీపంలో పెట్రోల్‌ అయిపోవడంతో పెట్రోల్‌ పంపు సమీపంలో సర్వీసు రోడ్డు పక్కన వదిలి వెళ్లిపోయారు. ఘటనా స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌తోపాటు ఫింగర్‌ ప్రింట్‌ టీం, సీసీఎస్‌ పోలీసులు పరిశీలించారు. నాలుగు ఇళ్లలో చోరీకి పాల్పడిన ఇద్దరు దుండగుల దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.

గుడిలోంచి వెళ్లగొట్టారు..

- రామాలయంలో పూజకు వెళ్లిన మహిళలను బయటికి పంపిన వీడీసీ
- తాళ్లరాంపూర్‌లో ఘటన.. పోలీసులకు ఫిర్యాదు



గుడిలో నుంచి బయటకు వస్తున్న మహిళలు

మోర్తాడ్‌(బాల్కొండ): దేవుని పూజకు వెళ్లిన మహిళలను వీడీసీ సభ్యులు ఆలయం నుంచి వెళ్లగొట్టిన ఘటన ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. కొన్ని నెలలుగా గ్రామాభివృద్ధి కమిటీకి, గౌడ సంఘం సభ్యులకు మధ్య వివాదం కొనసాగుతోంది. కాగా, శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా శనివారం కుంకుమ పూజను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పూజలో పాల్గొనేందుకు గ్రామానికి చెందిన అనేక మంది మహిళలు మంగళహారతులతో వెళ్లారు. గౌడ సంఘానికి చెందిన మహిళలు కూడా హాజరుకాగా, వారు వెళ్లిపోయేవరకూ పూజా కార్యక్రమం మొదలుపెట్టేది లేదని స్థానిక పురోహితుడి ద్వారా వీడీసీ సభ్యులు చెప్పించారు. మహిళలు అలాగే కూర్చుండగా పూజను ఆరంభించలేదు. చేసేది లేక గౌడ సంఘం మహిళలు గుడి నుంచి వెనుదిరిగారు. గ్రామంలో ఆలయ నిర్మాణం నుంచి ప్రతి ఏటా శ్రీరామనవమికి ముందు నిర్వహించే కుంకుమ పూజలో తాము ఆనవాయితీగా పాల్గొంటున్నామని మహిళలు వెల్లడించారు. వీడీసీకి, గౌడ సంఘానికి మధ్య వివాదం ఉంటే తమను అందులోకి లాగి దేవుని సేవకు దూరం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వీడీసీ సభ్యులపై ఏర్గట్ల పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై రాము వెల్లడించారు.

జల్సాలకు అలవాటుపడి చోరీలు

- నిందితుడి అరెస్ట్‌..బంగారం స్వాధీనం
- ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌, ఎస్సై రాజశేఖర్‌

ఖలీల్‌వాడి: జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్‌ చేసినట్లు ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. మాక్లూర్‌ మండలం మాదాపూర్‌ గ్రామంలోని పరుశు దేవానందం ఇంట్లో ఇటీవల చోరీ జరగగా, బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించామన్నారు. మాదాపూర్‌లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, ఇతర ఆధారాలతో మాణిక్‌బండార్‌(చెక్క) వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లా కార్లకు చెందిన నాందేవ్‌ ఆనందరావు ముండాకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

విచారణ అనంతరం పరుశు దేవానందం ఇంట్లో చోరీకి పాల్పడినట్లు నాందేవ్‌ ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడి నుంచి 65 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితుడు గతంలో నందిపేట్‌ పీఎస్‌ పరిధిలోని ఐలాపూర్‌, వెల్మల్‌ గ్రామాల్లో దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. వెల్మల్‌లో శ్రీనివాస్‌, అయిలాపూర్‌లో సందీప్‌ అనే వ్యక్తులతో కలిసి చోరీకి పాల్పడగా, అందుకు సంబంధించి 26 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శ్రీనివాస్‌, సందీప్‌లు గతంలోనే అరెస్టయినట్లు పేర్కొన్నారు. కాగా, నిందితుడు నాందేవ్‌ జక్రాన్‌పల్లి, బాల్కొండ, వేల్పూర్‌ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి ఆరునెలల క్రితం జైలుకు వెళ్లి మార్చి నెలలో బెయిల్‌పై వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 3న మాదాపూర్‌లో దొంగతనం చేసినట్లు చెప్పారు. మొత్తం 91 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకొని, నిందితుడు నాందేవ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వివరించారు. 48 గంటల్లోనే కేసును ఛేదించిన నార్త్‌ సీఐ శ్రీనివాస్‌, మాక్లూర్‌ ఎస్సై రాజశేఖర్‌, సిబ్బందిని అభినందించారు.

సామిల్‌లో అగ్ని ప్రమాదం

- రెండు దుకాణాల్లో మంటలు
- రూ. 20 లక్షల వరకు ఆస్తినష్టం
- నాలుగు ఫైరింజన్లతో మంటలార్పిన సిబ్బంది



సామిల్స్‌లో చెలరేగుతున్న మంటలు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పూలాంగ్‌ చౌరస్తా వద్ద ఉన్న రెండు సామిల్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. మొదట శంకర్‌ సామిల్‌, సాగ్వాన్‌ సామిల్‌లో మంటలు అంటుకోగా, పక్కన ఉన్న పద్మారావు సామిల్‌లోకి మంటలు వ్యాపించాయి. రెండు సామిల్స్‌లో మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగలు వ్యాపించడంతో ఫైరింజన్‌కు సమాచారం అందించారు. జిల్లా ఫైర్‌ ఆఫీసర్‌ పరమేశ్వర్‌ పర్యవేక్షణలో ఘటనా స్థలానికి నాలుగు ఫైరింజన్లు చేరుకోగా, ఫైర్‌ ఆఫీసర్‌ నర్సింగ్‌రావు, సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అదే సమయంలో పెట్రోలింగ్‌కు వెళుతున్న సీపీ పోతరాజు సాయిచైతన్య ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ ఇబ్బందులు కలుగకుండా చూశారు. ఈ రెండు సామిల్స్‌లో దుంగలన్నీ కాలిబూడిదకాగా, సుమారు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అధికారులకు యజమానులు తెలిపినట్లు తెలిసింది. ఫైర్‌ సిబ్బంది సుమన్‌, కిరణ్‌కుమార్‌, ప్రశాంత్‌, సురేందర్‌, ప్రశాంత్‌గౌడ్‌, సాయిరెడ్డి, సూరజ్‌ తదితరులు మంటలను ఆర్పారు.

కారులో చెలరేగిన మంటలు

- సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు



దగ్ధమైన వాహనం

కామారెడ్డి క్రైం: ఓ కుటుంబం ప్రయాణిస్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన ఘటన కామారెడ్డి సమీపంలోని క్యాసంపల్లి శివారు జాతీయ రహదారిపై శనివారం వేకువజామున చోటు చేసుకుంది. భువనగిరి నుంచి నిజామాబాద్‌ జిల్లా వర్ని మండలం బడాపహాడ్‌కు ఓ కుటుంబం స్కార్పియోలో వస్తున్నారు. అకస్మాత్తుగా మంటలు వ్యాప్తి చెందడాన్ని గమనించిన డ్రైవర్‌, వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి అందరినీ కిందికి దింపాడు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను ఆర్పారు. అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది.

మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి మండలంలోని అల్మాజీపూర్‌ గ్రామానికి చెందిన మధుమతి (21) ఈ నెల 4న అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్‌ శనివారం తెలిపారు. జంగమాయిపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌తో గతేడాది మధుమతికి వివాహమైందని, కుటుంబకలహాలతో ఆమె నాలుగు నెలలుగా అల్మాజీపూర్‌లో ఉంటుందని అన్నారు. ఈ నెల 4న రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తర్వాత మధుమతి వెళ్లిపోయిందని తెలిపారు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించక పోవడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్త

ఎల్లారెడ్డి: కుటుంబకలహాలతో భార్యపై దాడి చేసిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్‌ శనివారం తెలిపారు. మండలంలోని సోమార్‌పేట్‌ గ్రామానికి చెందిన రామగల్ల లావణ్యను భర్త శేఖర్‌ తరుచూ మద్యం తాగి కొట్టేవాడు. ఇదే విషయాన్ని బంధువులకు చెప్పడంతో ఆగ్రహం చెందిన శేఖర్‌, లావణ్య తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీసీఎం వ్యాన్‌ బోల్తా

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారులోని 44వ జాతీయ రహదారిపై శనివారం ఓ డీసీఎం వ్యాన్‌ అదుపుతప్పి బోల్తాపడింది. వ్యాన్‌ రాజమండ్రి నుంచి నిజామాబాద్‌ వైపునకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పింది. వ్యాన్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. సదాశివనగర్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్ట్‌

ఇందల్వాయి: తిర్మన్‌పల్లి గ్రామ శివారులో 33/11 కేవీ నూతన సబ్‌స్టేషన్‌ నిర్మాణ పనుల శంకుస్థాపన కోసం వేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన మేకల క్రాంతిని అరెస్టు చేసినట్లు ఎస్సై మనోజ్‌ తెలిపారు. గత గురువారం శిలాఫలకం ధ్వంసమైనట్లు విద్యుత్‌ శాఖ ఏఈ పండరీనాథ్‌ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. నిందితుడిని శనివారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని పట్టుకున్న పోలీస్‌ సిబ్బందిని సీఐ మల్లేశ్‌ అభినందించారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పరిధి మాలపల్లిలో పీడీఎస్‌ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్‌ సీఐ అంజయ్య శనివారం తెలిపారు. మాలపల్లి నుంచి ఏడు టన్నుల పీడీఎస్‌ బియ్యంతో వెళుతున్న మినీ వ్యాన్‌ను పట్టుకొని, సుమారు రూ.3 లక్షల విలువచేసే బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనంతోపాటు డ్రైవర్‌ షేక్‌ ఇమ్రాన్‌ను ఒకటో టౌన్‌ పోలీసులకు అప్పగించామన్నారు.